

సోమశిలలో 7.465 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 7.465 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి పెన్నార్‌డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,,620
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,683
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,883
నవర (8 గ్రాములు)	రూ.55,064



ఖరీదైన టేకు చోరీకి యత్నం

నగరంలోని సంతపేటలో ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో పట్టపగలే ఖరీదైన టేకును చోరీ చేసేందుకు కొంత మంది వ్యక్తులు ప్రయత్నించిన ఘటన బుధవారం జరిగింది.

8లో

రొంబా.. మోసం



జిల్లాలో తూనికలు కొలతల శాఖ నిద్రావస్థలో ఉందా? మొక్కుబడిగా విధులు నిర్వర్తిస్తోందా? మామూళ్లతో ముఖం చాటేస్తుందా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. రిజిస్టర్ దుకాణాల నుంచి రోడ్‌సైడ్ వ్యాపారం చేసే వాళ్ల వరకు టక్కరి తూకాలతో మోసాలకు పాల్పడుతున్నారు. నెల్లూరు నగరంలో బియ్యం, ఉప్పు, పప్పు, కూరగాయలు, మాంసం, చేపలు.. ఇలా ఏది కొనుగోలు చేసినా కిలోకు 900 గ్రాములే వస్తోంది. ఇక లీటర్లలో కొనుగోలు చేసే వస్తువులైతే లీటర్‌కు 800 నుంచి 850 మి.లీ. వస్తున్నాయి. సాధారణ కాటాతో పాటు ఎలక్ట్రానిక్ మెషీన్లలో సెట్టింగ్‌లు చేస్తూ వ్యాపారులు ఈ మోసాలకు పాల్పడుతున్నారు.

నగరంలో వస్తు విక్రయాల్లో నిలువు దోపిడీ

- సాధారణ కాటా, ఎలక్ట్రానిక్ మెషీన్లలోనూ చేతివాటం
- చేపలు, మాంసం దుకాణాల్లో పక్కా దగా
- కేజీకి.. 750 గ్రాములే
- గల్లీ కొట్టు నుంచి సూపర్ మార్కెట్ వరకు..

➡ నగరంలోని బీవీనగర్‌కు చెందిన రమణయ్య రెండు రోజుల క్రితం వనంతోపు సెంటర్ సమీపంలో మినీబైపాస్ పక్కనే ఉన్న చేపల దుకాణంలో నాలుగు కేజీల చేపను కొనుగోలు చేశాడు. తీరా బయటకు వచ్చి వేరే దుకాణంలో తూకం వేయిస్తే.. 3.200 కేజీలు మాత్రమే ఉంది. అంటే కేజీకి పావు కేజీ చొప్పున తూకంలో మోసం చేస్తున్నట్లు నిర్ధారణ అయింది. ఈ లెక్కన చూస్తే కేజీ చేప (లైవ్ ఫిష్) రూ.160 వరకు ధర ఉంది. దీని ప్రకారం చూస్తే కేజీకి దాదాపు రూ.40 వరకు దోపిడీ చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నగరంలో పెద్ద, చిన్న చితకా వ్యాపార సంస్థలన్నీ కలిపి సుమారు 1.50 లక్షలకు పైగా ఉంటాయి. వీటిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి మోసాలను అరికట్టాల్సిన బాధ్యత తూనికలు, కొలతల శాఖ అధికారులపై ఉంది. అయితే కొనుగోలు దారులు ఫిర్యాదులు చేస్తే తనిఖీలు చేస్తున్నారు. తూకాల్లో మోసం, నిబంధనల ఉల్లంఘనలపై మొదటి సారి జరిమానా విధిస్తారు. అదే తప్పు తిరిగి చేస్తే కేసు నమోదు చేసి కోర్టుకు సిఫార్సు చేస్తారు. కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అయితే కోర్టు జైలు శిక్ష విధించిన కేసులు పెద్దగా లేనట్లు తెలుస్తోంది. తక్కువ తూకం వేస్తే తూనికలు, కొలతల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2009 యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం కనీసం రూ.1000 నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారు. ప్యాకేజీ కమోడిటీ యాక్ట్ 30 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారికి రూ.2 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా వేస్తారు.



2023-24 ఏడాదిలో నమోదైన కేసులు

తూనికలు , కొలతల కేసులు - **1,546**

ప్యాకేజ్డ్ కమోడిటీస్ కేసులు - **1,252**

స్టాంపింగ్ ఫీజు - రూ. **2,74,91,706**

కాంపౌండింగ్ ఫీజు - రూ.**1,57,76,000**

'ఆప్షన్స్'తో గోల్‌మాల్

ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్‌లో మొత్తం నాలుగు ఆప్షన్లు ఉంటాయి. ఒకదాని సహాయంతో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. కిలోకు 100-150 గ్రాముల తక్కువగా ఉండేలా సెట్ చేస్తున్నారు. అప్పుడు ఆ ఆప్షన్ నొక్కి మెషిన్‌పై 850-900 గ్రాములు బరువు ఉంచితే 1000 గ్రాములు (కిలో)గా డిస్‌ప్లే చూపిస్తోంది. అదే మెషిన్‌పై కిలో బరువు ఉంచితే 1100-1150 గ్రాములు చూపుతుంది. అంటే కిలోకు 100-150 గ్రాముల వరకు తేడా ఉంటుంది. ఎవరైనా అనుమానంతో తమ వద్ద ఉండే కేజీ వస్తువును తూకం వేయండి అన్నప్పుడు.. అధికారులు తనిఖీలకు వస్తున్నారని ముందుగానే సమాచారం అందజేస్తుండడంతో కరెక్ట్ ఆప్షన్ సెట్ చేస్తున్నారు.

ప్యాకింగ్‌లో సైతం

మార్కెట్‌లో లభించే వివిధ బ్రాండ్ల నూనె ప్యాకెట్లు కూడా నిర్దేశించిన బరువు కంటే తక్కువగా ఉంటున్నాయి. లీటర్ ప్యాకేజ్డ్ నూనె నిబంధన ప్రకారం ప్యాకెట్‌లో 910 మి.లీ. ఉండాలి. కానీ 800-850 గ్రాములు మించడం లేదు. ఇక ఐదు లీటర్ల ప్యాకేజ్డ్ బాటిల్‌లో 200-280 గ్రాములు, 15 లీటర్ల ప్యాకేజ్డ్ బాటిల్‌లో 300-350 మి.లీ. తక్కువగా ఉంటోంది. తక్కువ తూకం గల ప్యాకింగ్‌లు సైతం తూనికలు, కొలత శాఖ దాడుల్లో బయటపడడమే ఇందుకు నిదర్శనం.

ఫుట్‌పాత్‌లపై దుకాణాల్లో..

నగరంలో ఫుట్‌పాత్‌ల పక్కనే విచ్చలవిడిగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారులు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. వీకెండ్ రోజుల్లో దుకాణాల వద్ద రద్దీ ఏర్పడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. నగర కార్పొరేషన్ ఉద్యోగులు వ్యాపారుల వద్ద నెలవారీ మామూళ్లు పుచ్చుకుని దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీంతో ఆ వ్యాపారులు బహిరంగంగానే తూకంలో మోసాలు చేస్తున్నారు. తూనికలు, కొలతల అధికారులకు మామూళ్లు ఇచ్చుకోవడంతో మోసాలను అరికట్టే ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో బరితెగించిన వ్యాపారులు కొనుగోలుదారులను మోసం చేస్తూనే ఉన్నారు.

పసిడి (బంగారం)లోనూ..

నగరంలోని పెద్ద పెద్ద దుకాణాల్లో మినహా మిగతా వాటిలో సాధారణంగా 24 క్యారెట్ల కంటే తక్కువ నాణ్యత కలిగిన బంగారాన్నే విక్రయిస్తుంటారు. వజ్రాల నగ కేవలం 18 క్యారెట్ల బంగారంతో మాత్రమే ఉంటుంది. వ్యాపారులు 18 క్యారెట్ల ఆభరణాన్ని వినియోగదారులకు విక్రయించి 22 క్యారెట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు. 22 క్యారెట్లు, 18 క్యారెట్ల ఆభరణానికి మధ్య గ్రాముకు కనీసం రూ.500 నుంచి రూ.700వరకు తేడా ఉంటుంది. ఈ లెక్కన కనీసం 10 గ్రాములకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు నష్టం తప్పడం లేదు. బంగారం తూచే ఎలక్ట్రానిక్ కాటాలవెను త్రాసును నియంత్రించే వీల్స్ బేరింగ్‌లను మార్పు చేసే అవకాశం ఉంటుంది. బంగారం నాణ్యతను తెలిపే మెషిన్ లేకపోవడంతో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

తూకంలో మోసాలు జరుగుతున్నట్లు మాకు ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. కూరగాయలు, చికెన్, చేపల మార్కెట్లలో ధర్మ కాటాలు కూడా ప్రవేశ పెట్టాం. తూకంలో తేడాలు కనిపిస్తే చాలు ధర్మకాటా ద్వారా తూకం వేసుకుని సరిచూసుకోవచ్చు. తక్కువ తూకం వస్తే తమ దృష్టికి తెస్తే తప్పకుండా ఆదుకాణ దారులపై చర్యలు తీసుకుంటాం. వనంతోపు సెంటర్‌లో కూడా తూకంలో మోసాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రావడంతో తనిఖీలు చేసి కాటాలను సీజ్ చేశాం.

– ఎస్.ఈశ్వరరావు, అసిస్టెంట్, కంట్రోలర్ నెల్లూరు

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షలకు సంబంధించి జనరల్ విద్యార్థులు 9,288 మందికి 8,766 మంది హాజరయ్యారు. 522 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 236 మందికి గాను 202 మంది హాజరయ్యారు. 34 మంది విద్యార్థులు హాజరుకాలేదు. మధ్యాహ్నం నుంచి జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు సంబంధించి జనరల్ విద్యార్థులు 2,164 మందికి 2,059 మంది హాజరయ్యారు. 105 మంది విద్యార్థులు హాజరుకాలేదు. ఒకేషనల్‌కు సంబంధించి 106 మందికి 90 మంది హాజరయ్యారు 16 మంది విద్యార్థులు హాజరు కాలేదు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 321

ఉదయగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.321 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 559 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకు రాగా 463 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 96 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్టంగా రూ.321, కనిష్టంగా రూ. 205 ధర లభించగా, సగటున కిలో పొగాకుకు రూ. 257.92 ధర లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

కార్బైడ్ వినియోగిస్తే చర్యలు

- ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నెల్లూరు(బారకాసు): జిల్లాలో ఎక్కడైనా మామిడి పండ్లతో పాటు ఇతర పండ్లకు కార్బైడ్ వినియోగిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ కంట్రోల్ అధికారి జి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నెల్లూరులోని కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జిల్లా మొత్తం మామిడి విక్రయాలు చేసే చోట తనిఖీలు నిర్వహించడంతో పాటు, హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం కూడా నిర్వహించామన్నారు. కార్బైడ్ వినియోగం ఇంత వరకు తాము చేసిన తనిఖీల్లో ఎక్కడా బయట పడలేదన్నారు. కార్బైడ్ వినియోగిస్తున్నట్లు ఆధారాలతో సహా తమకు అందజేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ



ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

నెల్లూరు(అర్బన్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ బుధవారం రాత్రి పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించేందుకు వచ్చిన ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఒక రాజకీయ పార్టీ ప్రతినిధితో కలిసి ఆ నియోజకవర్గ ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లను సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్న కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించుకునేందుకు ఏర్పాటు చేసిన సీసీటీవీల మానిటరింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా కౌంటింగ్ కేంద్రంలో త్వరితగతిని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు నెల్లూరు సిటీ, కోవూరు, కందుకూరు రిటర్నింగ్ అధికారులు వికాస్‌మర్మత్ సేతు మాధవన్, విద్యాధరి పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

పొదలకూరు : పట్టణంలోని పొట్టి శ్రీరాములు పార్కులోని నీళ్ల ట్యాంకు వద్ద తేనెటీగలు దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మూడు రోజుల క్రితం ఆకతాయిలు పార్కు వద్ద ఉన్న ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన తేనెతుట్టెపై రాళ్లు రువ్వారు. దీంతో తేనెటీగలు విజృంభించి మెయిన్ రోడ్డుపై వెళుతున్న సుమారు 20 మందిపై దాడి చేశాయి. ఈ దాడి నుంచి చాలా మంది తప్పించుకుని పారిపోయారు. కొందరు స్వల్పంగా ఈగల దాడిలో గాయపడి స్థానికంగా చికిత్స పొందారు. అయితే పట్టణంలోని శ్రామికనగర్‌కు చెందిన ఇండ్ల అంకయ్య(52)పై తేనెటీగలు బలంగా దాడి చేశాయి. దీంతో అంకయ్యను నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

కౌంటింగ్.. ఏ నియోజకవర్గం ఎక్కడ

నెల్లూరు (పొగతోట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం ఏర్పాట్లు శరవేగంగా చేస్తోంది. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు నెల్లూరు పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. ఇక్కడే కౌంటింగ్ ప్రక్రియ కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఏ నియోజకవర్గం ఓట్లు ఏ బ్లాక్‌లో చేపడుతున్నారనే వివరాలను జిల్లా ఎన్నికల అధికారులు వివరించారు. కౌంటింగ్‌కు హాజరయ్యే సిబ్బందితో పాటు రాజకీయ పార్టీల ఏజెంట్లు ఎవరూ గందరగోళానికి గురికాకుండా ప్రత్యేకంగా బ్యారికేడ్లతో ద్వారాలు ఏర్పాటు చేయనున్నారు.

నెల్లూరు పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్

పోస్టల్ బ్యాలెట్	సౌత్‌బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ ఐటీ ల్యాబ్
కందుకూరు	నార్త్‌బ్లాక్ 2వ అంతస్తు కంప్యూటర్ ల్యాబ్
కావలి	నార్త్‌బ్లాక్ 3వ అంతస్తు సెమినార్ హాల్ (406)
ఆత్మకూరు	నార్త్‌బ్లాక్ 3వ అంతస్తు క్లాస్‌రూమ్ (401)
కోవూరు	నార్త్‌బ్లాక్ 1వ అంతస్తు ఫిజిక్స్ ల్యాబ్
నెల్లూరు సిటీ	నార్త్‌బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ కెమిస్ట్రీ ల్యాబ్
నెల్లూరు రూరల్	నార్త్‌బ్లాక్ 2వ అంతస్తు లెక్చరర్ హాల్ (306)
సర్వేపల్లి	సౌత్‌బ్లాక్ 2వ అంతస్తు లెక్చరర్ హాల్ (303)
ఉదయగిరి	నార్త్‌బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ లెక్చరర్ హాల్ (104)

అసెంబ్లీ ఓట్ల లెక్కింపు కేంద్రాలు

కందుకూరు	2వ అంతస్తు నార్త్‌బ్లాక్ డ్రాయింగ్ హాల్ (301)
కావలి	3వ అంతస్తు నార్త్‌బ్లాక్ క్లాస్‌రూమ్ (409)
ఆత్మకూరు	3వ అంతస్తు నార్త్‌బ్లాక్ సెమినార్‌హాల్ (405)
కోవూరు	1వ అంతస్తు నార్త్‌బ్లాక్ డ్రాయింగ్ హాల్
నెల్లూరుసిటీ	గ్రౌండ్‌ఫ్లోర్ నార్త్‌బ్లాక్ లెక్చరర్‌హాల్ (107)
నెల్లూరురూరల్	2వ అంతస్తు నార్త్‌బ్లాక్ ఫ్యాకల్టీ రూమ్
సర్వేపల్లి	1వ అంతస్తు సౌత్‌బ్లాక్ సెమినార్ హాల్
ఉదయగిరి	1వ అంతస్తు క్లాస్‌రూమ్ (201)

కొడవలూరు ఎస్సైపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (క్రైమ్): కొడవలూరు ఎస్సై వీరప్రతాప్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై ప్రాథమిక విచారణ నిమిత్తం హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఎస్పీ కార్యాలయం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. కొడవలూరు ఎస్సై ఇసుక టిప్పర్ల యజమానుల నుంచి రూ.1.10 లక్షల వసూలు చేయడంతో, ఆయనపై అనేక అవినీతి ఆరోపణలతో 'సాక్షి'లో బుధవారం 'కాసుల వేటలో ఖాకీ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ స్పందించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొడవలూరు ఎస్సైని ప్రాథమిక విచారణ నిమిత్తం వెంటనే జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అంత వరకు బుచ్చిరెడ్డిపాళెం సీఐ సుబ్బారావును పర్యవేక్షించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

లెక్కింపునకు పక్కాగా ఏర్పాట్లు



కేంద్ర ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (అర్బన్): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ చేయడానికి పటిష్టంగా ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ హరినారాయణన్ వివరించారు. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని 8 నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో లెక్కింపునకు సంబంధించి 1000 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఇంటర్నెట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంలకు 3 అంచెల భద్రతను సిద్ధం చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్లు లెక్కించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న సాయంత్రం 4 గంటలకు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద బ్యారికేడ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారుల సేతుమాధవన్, వికాస్ మర్మత్, విద్యాధరి, మధులత, శీనానాయక్, చిన్న ఓబులేశు, ప్రేమ్‌కుమార్, మలోల పాల్గొన్నారు.

పొగాకు అ'ధర'హో

పొగాకు రైతుల ఆనందానికి అవధుల్లేవ్. గడిచిన రెండేళ్లుగా పొగాకు ధరలు రైతుల ఊహకు అందని రీతిలో పెరగడంతో ఉత్సాహంగా ఉన్నారు. గతంలో ఒక వైపు కరువు.. మరో వైపు ధరాఘాతంతో పొగాకు రైతుల జీవితాలు తల్లకిందులయ్యాయి. నష్టకష్టాలు ఎదురైనా పొగాకునే నమ్ముకుని సాగు చేసిన రైతుల జీవితాల్లో ఒక్కసారిగా రాజసం నెలకొంది. అంతర్జాతీయ మార్కెట్‌లో వర్జీనియా పొగాకుకు భారీ డిమాండ్ ఏర్పడంతో ధరలు అనుకున్న దాని కంటే అధికంగా లభిస్తున్నాయని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండేళ్లుగా పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో బ్యారెన్ కౌలు ధరలు కూడా పెరుగుతున్నాయి.

- రికార్డు స్థాయిలో కిలో పొగాకు ధర రూ. 321
- ఇప్పటి వరకు ఎనిమిది రౌండ్ల వేలం
- డీసీపల్లిలో రూ.119.81 కోట్ల పొగాకు విక్రయం
- కలిగిరిలో రూ. 86 కోట్ల విక్రయాలు



డీసీపల్లిలో పొగాకు వేలం జరుగుతున్న దృశ్యం (ఫైల్)



కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు (ఫైల్)



గరిష్ట ధర రూ.**321**

కనిష్ట ధర రూ.**205**

సగటు ధర రూ. **257.92**

మర్రిపాడు/ఉదయగిరి: రెండేళ్ల క్రితం వరకు పొగచూరిన రైతుల జీవితాల్లో ఇప్పుడు 'రాజసం' ధరహాసం చేస్తోంది. గతంలో పొగాకు పంటకు ఆశాజనక ధర లేక.. సాగు విస్తీర్ణం సైతం తగ్గించాల్సి వచ్చింది. గడిచిన రెండేళ్లుగా పొగాకు ధరలు రైతుల ఊహించిన దానికంటే అత్యధికంగా పెరిగాయి. దీంతో మెట్ట ప్రాంతంలో పొగాకు పండే భూములకు, బ్యారన్లకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఔత్సాహిక రైతులు సైతం భూములు కౌలుకు తీసుకుని పొగాకు పంటను సాగు చేపట్టడం మొదలు పెట్టారు. గతేడాది ఇదే సీజన్‌లో పొగాకు కిలోకు గరిష్టంగా రూ.256 లభిస్తే.. ప్రస్తుత సీజన్‌లో అంతకు మించి రూ.321 గరిష్ట ధర లభించింది. రెండేళ్లకు ముందు వరకు అయితే రూ.200 కంటే తక్కువగానే ఉండేది. దీంతో రెండేళ్లుగా పొగాకు రైతులు కష్టాల నుంచి క్రమేపి గట్టెక్కుతున్నారు. ఈ ఏడాది నాణ్యమైన గ్రేడ్ పొగాకుతో పాటు మధ్య రకం, లోగ్రేడ్ పొగాకుకు కూడా చాలా మంచి ధరలు లభిస్తుండటంతో లాభాల బాట పడుతామని ప్రతి రైతు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లోని లాభాల ట్రెండ్ మరో రెండు మూడు సీజన్ల వరకు జరుగుతుందని భావిస్తూ బ్యారెన్ కౌలు ధరలను పెంచేస్తున్నారు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే బ్యారెన్ కౌలు ధర రెండు నుంచి మూడింతలు పెరిగింది.

డీసీపల్లిలో రూ.119.81 కోట్ల వ్యాపారం

ఈ ఏడాది డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో పొగాకు ధరలు ఆశాజనకంగా సాగింది. ఇప్పటి వరకు 8 రౌండ్ల పొగాకు వేలంలో రూ.119.81 కోట్ల విలువైన పొగాకు విక్రయాలు జరిగాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా 35 కంపెనీలు పొగాకు కొనుగోళ్లకు ఇక్కడకు తరలివచ్చాయి. డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలోని 11 మండలాల్లో 2,084 మంది రైతులు పొగాకును సాగు చేస్తుండగా, 1,720 బ్యారెన్లకు అనుమతి లభించింది. అధికారికంగా 4,989 హెక్టార్లలో పొగాకు పంటను సాగు చేశారు. అనధికారికంగా మరో 6.27 హెక్టార్లలో పంట సాగు చేశారు. ఇప్పటి వరకు వేలంలో 45,505 పొగాకు బేళ్లను తీసుకుని రాగా వాటిలో 7,308 పొగాకు బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఇందులో నోసేల్ 2,116, నోబిడ్ 2,984, ఆర్ఆర్ 19, సీఆర్ 1,326గా గుర్తించారు. వేలంలో ఇప్పటి వరకు 4.83 మిలియన్ కిలోల పొగాకు విక్రయం జరిగింది.

కలిగిరి కేంద్రంలో రూ. 86 కోట్ల విక్రయాలు

కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు 3.5 మిలియన్ కేజీల పొగాకు రూ. 86 కోట్ల మేర విక్రయాలు చేశారు. మార్చి 6వ తేదీన వేలం ప్రారంభమైంది. వేలం ప్రారంభంలో కిలో పొగాకుకు రూ. 231 ధర లభించగా, క్రమేపి ధరలు పెరుగుతూ వచ్చాయి. మే నెల ప్రారంభం నుంచి ఊహించని స్థాయిలో ధరలు పెరగడం ప్రారంభించాయి. ప్రస్తుతం కిలో పొగాకు రూ. 321 లభిస్తోంది. కలిగిరి వేలం కేంద్రం పరిధిలో 1,436 మంది రైతులు పొగాకు సాగు చేశారు. అయితే 1,258.83 బ్యారెన్లకు అనుమతి లభించింది. బోర్డు 3,600 హెక్టార్లలో సాగుకు అనుమమతి ఇవ్వగా, అదనంగా మరో 123 హెక్టార్లలో సాగు చేశారు. 4.58 మిలియన్ కేజీల విక్రయానికి అనుమతి ఇవ్వగా, అంచనాలకు మించి 7 మిలియన్ కేజీల దిగుబడి వచ్చినట్లు అంచనా.

ఇలాంటి ధరలు ఎప్పుడూ చూడలేదు



ఇరవై ఏళ్లుగా పొగాకు సాగు చేస్తున్నప్పటికి ఇలాంటి ధరలు ఎప్పుడూ చూడలేదు. ఈ ఏడాది 5 బ్యారన్లలో 50 ఎకరాల పొగాకు సాగు చేస్తున్నాను. ఎకరాకు రూ. 1.20 లక్షల పెట్టుబడి అవుతుంది. ప్రస్తుత ధరలను బట్టి ప్రతి రైతుకు సగటున ఎకరాకు రూ. 70 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

– పూసాల అక్కపునాయుడు, రావులకొల్లు, కలిగిరి, మండలం

రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు



ఈ ఏడాది వేలంలో రైతులు ఆశించిన మేర ధరలు లభిస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా లభిస్తున్న ధరలతో మరింత మంది రైతులు పొగాకు వేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. బోర్డు సూచించిన మేరకు పొగాకు సాగు చేపడితే రైతులు కూడా లాభాలు పొందవచ్చు.

– రాజశేఖర్, వేలం నిర్వహణాధికారి, డీసీపల్లి పొగాకు బోర్డు వేలం

రైతులకు మంచి ధరలు లభిస్తున్నాయి



ఈ ఏడాది పొగాకు అమ్మకాల్లో రైతులకు మంచి ధరలు లభిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో పొగాకును ఉత్పత్తి చేసే దేశాల్లో పొగాకు దిగుబడులు తగ్గడమే ప్రస్తుతం ధరలు గణనీయంగా పెరగడానికి ప్రధాన కారణం. ఈ ధరలు స్థిరంగా ఉంటాయని చెప్పలేం. – వి. మహేష్‌కుమార్, వేలంనిర్వహణాధికారి, కలిగిరి పొగాకుబోర్డు

క్లుప్తంగా

వైభవంగా ధ్వజారోహణం



కొడిముద్దలను అందజేస్తున్న దృశ్యం

కోవూరు: మండలంలోని జొన్నవాడ గ్రామంలో ఉన్న మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ధ్వజారోహణను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు చేశారు. కొడి ముద్దలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ గిరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గొలగమూడిలో నగదు చోరీ

వెంకటాచలం: ఇంటి తాళాలు పగులగొట్టి రూ.25 వేలు నగదును చోరీ చేసిన ఘటన మండలంలోని గొలగమూడి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గొలగమూడి గ్రామానికి చెందిన శేఖర్‌నాయుడు, అతని భార్య మంగళవారం రాత్రి 11 గంటల వరకు టీవీ చూసి అనంతరం ఇంటికి తాళాలు వేసి మిద్దెపైన నిద్రపోయారు. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు నిద్ర లేచి కిందకు వచ్చారు. అప్పటికే తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లినట్లు గుర్తించారు. బ్యాగ్‌లో దాచిన రూ.25 వేలు నగదు కనిపించలేదు. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా తెరిచేందుకు ప్రయత్నించి విఫలమైనట్లు తేలింది. తమ బంధువులు కాశీకి వెళ్తూ బంగారు నగలు, నగదు ఇచ్చారని, వాటిని బీరువాలో దాచారు. బీరువాను పగులగొట్టి ఉంటే భారీ స్థాయిలో నష్టం జరిగి ఉండేదని శేఖర్‌నాయుడు వాపోయారు. చోరీ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు గొలగమూడికి వచ్చి పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని గుడిపల్లిపాడులో సాయి బృందావనం గోల్డెన్ సిటీ లేఅవుట్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

డీజిల్ విక్రయాలపై ఆంక్షలు

- అనుమతుల కోసం ఆస్పత్రుల సిబ్బంది కష్టాలు
- రోగుల ఇబ్బందులు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల కమిషన్ పెట్రోలు, డీజిల్ లూజు విక్రయాలపై ఆంక్షలు విధించింది. దీంతో లూజు విక్రయాలు చేయరాదని జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే ఉదయగిరిలో పెట్రోల్ బంకు యజమానితోపాటు కొనగోలుదారుడిపై సైతం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా లూజు విక్రయాలు జరగడం లేదు. ఈసీ ఆంక్షలు హాస్పిటళ్లు, అపార్ట్‌మెంట్ వాసులు తదితరాలను ఇబ్బందుల్లోకి నెట్టేశాయి. ఆస్పత్రుల పరిస్థితి దారుణంగా మారుతోంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయి అత్యవసర పరిస్థితి ఏర్పడితే జనరేటర్లను వినియోగించేందుకు డీజిల్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆపరేషన్లు చేసే సమయంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. డీజిల్ కోసం పెట్రోల్ బంకు వద్దకు వెళ్తే పోలీసుల నుంచి పర్మిషన్ తీసుకురావాలని చెబుతున్నారు. పోలీసుస్టేషన్‌కు వెళితే కలెక్టర్ కార్యాలయం నుంచి అనుమతి తెచ్చుకోవాలని చెబుతుండడంతో హాస్పిటల్ సిబ్బందికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. అత్యవసర విభాగాలకు ఆంక్షలు సడలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 156
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 274
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 304
లేయర్ చికెన్	: 204

నిరంతరం సోదాలు చేస్తున్నా..

- ఫలితమివ్వని పోలీసుల చర్యలు
- వరుస దొంగతనాలతో జనం హడల్
- గస్తీ పెంచాలని డిమాండ్

నెల్లూరు(క్రైమ్): నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు పోలీసులు కార్డన్ సెర్చ్ పేరిట జిల్లాలో సోదాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి సరైన పత్రాల్లేని వాహనాలు, అక్రమ మద్యం నిల్వలను స్వాధీనం చేసుకుంటున్నారు. పలువురు నేరస్తులను సైతం అదుపులోకి తీసుకున్నారు. సోదాల నేపథ్యంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నా అక్కడక్కడా నేరాలు జరుగుతూనే ఉన్నాయి. పలుచోట్ల చోరీలు, చోరీ యత్నాలు చోటుచేసుకున్నాయి. మర్రిపాడు మండలం డీసీపల్లిలో పట్టపగలు దుండగులు ఓ ఇంట్లోకి ప్రవేశించి 30 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు, రూ.40 వేల నగదును అపహరించుకెళ్లారు. నెల్లూరు పడారుపల్లిలో ఏకంగా ఏటీఎంను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి రూ.2.45 లక్షల నగదును దోచుకెళ్లారు. మాగుంట లేఅవుట్‌లోని మూడు ఇళ్లలో దుండగులు చోరీకి యత్నించిన ఘటన సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా వెలుగులోకి వచ్చింది. ఓ వైపు పోలీసుల సోదాలు కొనసాగుతున్నా దుండగులు చోరీలు, చోరీ యత్నాలకు పాల్పడుతూ సవాల్ విసరుతున్నారు. దీనిని బట్టి చూస్తే సోదాలు మరింత విస్తృతం చేయడంతో పాటుగా పోలీసుల గస్తీని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



స్వాధీనం చేసుకున్న వాహనాల వద్ద పోలీసు అధికారులు



గ్యాస్‌కట్టర్‌తో లాకర్‌ను కట్ చేసిన దృశ్యం (ఫైల్)

80 వాహనాల స్వాధీనం

కార్డన్ సెర్చ్‌లో భాగంగా బుధవారం చిన్నబజారు, సంగం, ఎస్ఆర్‌పురం, ఇందుకూరుపేట, కలిగిరి, దుత్తలూరు పోలీసు స్టేషన్‌ల పరిధిలో పోలీసు అధికారులు సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 79 బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌లకు తరలించారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం



సోమశిల: అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయం ప్రాంతంలో ఓ వృద్ధురాలి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. ఎస్సై సుబ్బారావు కథనం మేరకు.. సోమశిల శివాలయం బ్రిడ్జి సమీపంలో వృద్ధురాలి మృతదేహం నీటిపై తేలుతోందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆమె పర్సులో ఆధార్‌కార్డు లభ్యమైంది. దాని ఆధారంగా వైఎస్సార్ జిల్లా నరసాపురం మండలం బాలరాజుపల్లికి చెందిన పంగా అంకన్న గారి చెన్నమ్మ (74)గా గుర్తించారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేక ప్రమాదవశాత్తు జారి పడిందా అని తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. చెన్నమ్మ బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తెలుగుదేశం చిల్లర చేష్టలు

- ఆ పార్టీకి చెందిన వ్యక్తిపై తెలుగు తమ్ముడి దాడి
- వైఎస్సార్‌సీపీపై బురద వేసేందుకు యత్నం
- నిజాన్ని బయటపెట్టిన పోలీసులు

ముత్తుకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రోజురోజుకు దిగజారిపోతోంది. ఓటమి భయంతో చిల్లర చేష్టలకు పాల్పడుతోంది. టీడీపీకి చెందిన వ్యక్తిపై ఆ పార్టీ వర్గీయుడే దాడి చేస్తే దానిపై తప్పుడు ప్రచారానికి పూనుకున్నారు. ఈ క్రమంలో ఎల్లో మీడియాను వాడుకున్నారు. అయితే ఈ విషయంలో నిజాల్ని చూసి టీడీపీ చేసిన పనిని అందరూ అసహ్యించుకుంటున్నారు. మండలంలోని పైనాపురం గ్రామం దేవరదిబ్బసంగంలో ఈగా నరేష్ అనే వ్యక్తి టీడీపీకి ఓటు వేశాడని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాడి చేశారని తెలుగు తమ్ముళ్లు ప్రచారం చేశారు. దీనికి సంబంధించి బుధవారం ఈనాడులో 'వైకాపాకు ఓటు వేయలేదని గిరిజనులపై దాడి' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వ్యవహారంపై కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి, ఎస్సై శ్రీనివాసులురెడ్డి స్పందించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించి వాస్తవాలు వెల్లడించారు. నరేష్‌పై దాడి చేసింది తెలుగుదేశం పార్టీకి చెందిన బల్లి వెంకటరమణయ్య, అతని సహచరులేనని స్పష్టం చేశారు. గాయపడిన నరేష్ టీడీపీలోనే కొనసాగుతున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. వెంకటరమణయ్య ఈనెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున ఏజెంట్‌గా ఉన్నట్లు బయటపడిందన్నారు. మద్యం తాగిన నిందితుడు ఆ మత్తులో నరేష్‌పై దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కృష్ణపట్నం పోలీస్‌స్టేషన్లో కేసు కూడా నమోదు చేశామన్నారు. ప్రజలు వదంతులు నమ్మవద్దని, ఆ ప్రాంతంలో 30 పోలీస్ యాక్ట్ 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించాలని ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై వెంకటరెడ్డి, శ్రీనివాసులురెడ్డి

ఖరీదైన టేకు చోరీకి యత్నం



మలేరియా భవనం పైకప్పు తొలగించిన దృశ్యం



పరిశీలిస్తున్న అధికారులు

- వైద్యశాఖలో కలకలం

నెల్లూరు(అర్బన్): నగరంలోని సంతపేటలో ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో పట్టపగలే ఖరీదైన టేకును చోరీ చేసేందుకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నించిన ఘటన బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వైద్యశాఖ ఆవరణలో జిల్లా మలేరియా కార్యాలయం ఉంది. ఇది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆ భవనాన్ని కొంతకాలం క్రితమే అధికారులు ఖాళీ చేసి వైద్యశాఖ కార్యాలయంలో ఒక ఆఫీసును ఏర్పాటు చేసుకున్నారు. ఆ పాత భవనం నిర్మాణంలో అత్యంత ఖరీదైన బర్మా టేకును వినియోగించారు. ఇదే అదనుగా భావించిన కొంతమంది వాహనాలు తీసుకుని వచ్చి టేకును దొంగిలించేందుకు ప్రయత్నం చేశారు. కొన్ని గోడలు పగులగొట్టి పైకప్పును తొలగించారు. టేకును తస్కరించబోయారు. ఈ విషయం డీఎంహెచ్ఓ పెంచలయ్యకు తెలియడంతో ఆయన ఆదేశాల మేరకు జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది కలప తరలింపు ప్రక్రియను అడ్డుకున్నా రు. దీంతో వాహనదారులు జారుకున్నారు. ఉద యం 10 గంటలకే దర్జాగా కలపను తీసుకెళ్లే ప్రయత్నం చేయడం వైద్యశాఖలో కలకలం రేపింది.

ఉద్యోగి సహకారం?

టేకు చోరీకి ప్రయత్నం చేసే ఘటనలో మలేరియా శాఖకు చెందిన ఓ ఉద్యోగి హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు విచారించి ఆ వ్యక్తిపై తగిన చర్యలు చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు. వాచ్‌మెన్ ఉండి కూడా ప్రయోజనం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలోనూ చోరీ

వైద్యారోగ్య శాఖలో పురాతన భవనాలు అనేకం ఉన్నాయి. అవన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. వాటిలో అత్యంత ఖరీదైన టేకు ఉంది. గతంలో కూడా పలువురు టేకును తీసుకెళ్లిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. లక్షలాది రూపాయల విలువైన కలపను కాపాడాల్సిన అవసరం ఉంది.

నిర్లక్ష్యంగా వదిలేసిన మందులు

ఇదిలా ఉండగా శిథిలావస్థ భవనంలో మలేరియా శాఖకు చెందిన పలు మందులు నిర్లక్ష్యంగా వదిలేశారు. రోగులకు అందాల్సిన వాటిని ఇలా వదిలేయడంపై ఆరోగ్య శాఖ నిర్లక్ష్యాన్ని అనేక మంది వేలెత్తి చూపుతున్నారు. ఈ విషయమై హుస్సేనమ్మ మాట్లాడుతూ టేకు చోరీ యత్నంపై ఆందోళన వ్యక్తం చేశారు. మందులను నిర్లక్ష్యంగా వదిలేయలేదని వాటిని పాత భవనం నుంచి వేరే రూమ్‌కు మార్చుతున్నామని తెలిపారు.

టీడీపీ నాయకుల అత్యుత్సాహం

- బాణసంచా కాల్చడంతో అగ్నిప్రమాదం
- వైఎస్సార్‌సీపీ వర్గీయుల గడ్డివాముల దగ్ధం

కావలి: దగదర్తి మండలం తురిమెర్లలో టీడీపీ నాయకుల అత్యుత్సాహం కారణంగా నాలుగు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. మంగళవారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని టీడీపీకి చెందిన వారు మద్యం మత్తులో బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో నిప్పురవ్వలు వైఎస్సార్‌సీపీ వర్గీయులకు చెందిన నాలుగు గడ్డివాములపై పడి మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే మంటలు వ్యాపించి గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది. అయినా తురిమెర్లలో మాత్రం టీడీపీ నాయకులు ఎన్టీఆర్ జయంతి పేరుతో వీరంగం చేయడం గమనార్హం. మద్యం తాగి విచ్చలవిడిగా టపాసులు పేలుస్తూ వైఎస్సార్‌సీపీ వర్గీయులను రెచ్చగొట్టే ధోరణిలో కవ్వింపు చర్యలకు దిగారు. చివరకు బాణసంచా కాల్చడం వల్ల నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి.



దగ్ధమవుతున్న గడ్డివాములు

క్రీడా పోటీల్లో రాణించిన మహిళలు

కందుకూరు: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల మూడురోజులపాటు జరిగిన నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు మహిళా క్రీడాకారిణులు ప్రతిభ చూపారు. కందుకూరు వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎండీ హాజీరాబేగం 45 ఏళ్ల విభాగం హ్యామర్‌త్రో పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించి జూలైలో జరిగే వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే కందుకూరు కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ ఎస్.లక్ష్మి 200 మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ మెడల్, 400 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించారు. నెల్లూరుకు చెందిన గృహిణి ఎస్‌కే సమీన్ 5కే వాకింగ్‌లో సిల్వర్ మెడల్‌ను, ఎండీ అల్లారఖి హ్యామర్‌త్రోలో బ్రాంజ్ మెడల్ పొందారు. వీరు కూడా ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికయ్యారు. తమ విజయానికి సహాయ సహకారాలు అందించిన ఒంగోలు మాస్టర్ అథ్లెటిక్స్ ప్రెసిడెంట్ విజయభాస్కర్, టి.సురేష్‌కు వారు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు.



ప్రతిభ చూపిన మహిళలు

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలో? అనారోగ్యమో? మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు కానీ రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమాదంలో అతని మృతదేహం పూర్తిగా ఛిద్రమై గుర్తుపట్టలేని విధంగా మారింది. ఈ ఘటన అయ్యప్పగుడి ఫ్లై ఓవర్ రైల్వేగేటు సమీపంలో నెల్లూరు వచ్చే రైలు పట్టాలపై బుధవారం చోటుచేసుకుంది. మృతుడి వయసు 65 నుంచి 70 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. వైట్ కలర్‌పై బ్లూ కలర్ గళ్లు కలిగిన హాఫ్ షర్ట్, వైట్ కలర్ పంచె, టవల్ ధరించి ఉన్నాడు. షర్ట్ కాలర్‌పై క్లాసిక్ టైలర్ బుచ్చి అని రాసి ఉంది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు. షర్ట్ కాలర్‌పై ఉన్న లేబుల్ ఆధారంగా బుచ్చిలో మృతుడి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.62
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

ఉదయగిరి: నిరుపేదకు కష్టమొచ్చింది. కుటుంబాన్ని పోషించాల్సిన యజమాని మృత్యువుతో పోరాడుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి. ఉదయగిరి పట్టణంలోని ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల సుబ్రహ్మణ్యం బేల్దారి పనులు చేసుకుంటూ భార్యాబిడ్డలను పోషించుకునేవాడు. కొద్దిరోజుల క్రితం అతడికి డెంగీ జ్వరం వచ్చింది. వైద్యం చేయించుకుంటున్నాడు. ఊహించని విధంగా బ్రెయిన్ సంబంధ సమస్యతో కోమా స్థితిలోకి వెళ్లాడు. దీంతో కుటుంబసభ్యులు నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇక్కడ వైద్యానికి నిమిత్తం రోజుకు రూ.20 వేలు వరకు ఖర్చవుతోంది. కొన్ని వైద్య పరీక్షలకు ఆరోగ్యశ్రీ వర్తించింది. మిగిలిన వాటి విషయంలో చెల్లించేందుకు ఆ కుటుంబం వద్ద చిల్లిగవ్వ లేదు. దీంతో తల్లడిల్లుతున్నారు. అతను పూర్తిస్థాయిలో కోలుకోవాలంటే మరో పది, పదిహేను రోజులపాటు వైద్యం అందాల్సి ఉందని డాక్టర్లు చెబుతున్నారు. ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. సాయం చేయాలనుకునే వారు 80088 85356 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న సుబ్రహ్మణ్యం